క్లుప్తంగా...

మొక్కలు నాటిన కౌన్సిలర్



మొక్కలు నాటుతున్న కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ మంగళవారం తన జన్మదినం సందర్భంగా మొక్కలు నాటారు. మున్సిపాలిటీ పరిధి సుతారిగూడలో నిర్వహించిన హరితహారంలో భాగంగా స్థానిక కౌన్సిలర్ రజిత వెంకటేశ్, పెంటయ్యతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మల్లేశ్, రాముయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో మహిళలు, గ్రామస్తులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం గ్రామంలో మంగళవారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ సమేత సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయాలన్ని అందంగా ముస్తాబు చేసి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైల్వేవంతెన పనులు పూర్తి చేయాలని వినతి



రోడ్లు భవనాల శాఖ ఈఈతో మాట్లాడుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, జంగయ్యయాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఈఈ శ్రీనివాసమూర్తికి మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, జంగయ్య యాదవ్ వినతి అందజేశారు. మంగళవారం ఈఈ కార్యాలయంలో కలిసి ఏళ్లుగా వంతెన పనులు కొనసాగుతున్నాయని, జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్‌ను తొలగించి తిరిగి కొత్తగా టెండర్ వేయించాలని లేఖలో పేర్కొన్నారు. అలాగే రైల్వే వంతెన భూబాధితులకు పరిహారం చెల్లించి వంతెన పనులు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



గోధుమకుంటలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తూ..

కీసర: గోధుమకుంట గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోధుమకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు మంచాల కిరణ్‌జ్యోతి ప్రవీణ్, ఉపసర్పంచ్ ఆంజనేయులు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి



లక్ష్మణ్‌మూర్తి(ఫైల్)

కీసర: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి వివరాల ప్రకారం కుషాయిగూడ చక్రిపురం ప్రాంతానికి చెందిన లక్ష్మణ్‌మూర్తి(45) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అహ్మద్‌గూడ నుంచి కుషాయిగూడ వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుకవైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన ఆటో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో ఆయన రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లక్ష్యం 176

35 పాఠశాలల్లోనే పూర్తయిన పనులు

- అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ
- కనీసం సగం వరకు కూడా పూర్తికాని వైనం
- నెలలో పూర్తి చేస్తామంటున్న విద్యాశాఖ
- బిల్లుల చెల్లింపు జాప్యంతో సాగుతున్న పనులు
- ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు నిరాశే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్కూళ్లను కార్పొరేటుకు ధీటుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం.. అనుకున్న స్థాయిలో పురోగతి లేకపోవడంతో నిరాశే ఎదురవుతోంది. నూతన విద్యా సంవత్సరంలో కొత్త హంగులతో పాఠశాలలు ముస్తాబవుతాయని భావించినా.. ఆశలు అడియాసలయ్యాయి. దీంతో సమస్యల మధ్యే విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మన ఊరు.. మన బడి పథకం కింద మొదటి విడతగా 176 పాఠశాలలు ఎంపిక చేశారు. అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం తదితర పనులు, మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

అవస్థల మధ్యే చదువులు..

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దాలని, దశలవారీగా పనులు చేపట్టాలని నిర్ణయించినా మొదటి దశ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏడాది క్రితమే పనులు చేపట్టినా.. ఇప్పటికీ పూర్తికాకపోవడం శోచనీయం. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని పనులు చేపడతారని భావించినా పూర్తి చేయలేకపోయారు.

పనులు వేసవి సెలవుల్లోగా పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు మన ఊరు–మన బడి కింద 35 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో వివిధ స్థాయిల్లో పనులు కొనసాగుతూనే ఉన్నా.. నెల రోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

మండలానికి రెండింటి చొప్పున..

మన ఊరు–మనబడి కార్యక్రమం కింద మొదటి ప్రాధాన్యతగా మండలానికి రెండు ప్రభుత్వ పాఠశాలలు చొప్పున 15 మండలాల్లో 30 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. ఇటీవల మరో 5 పాఠశాలల్లో కూడా పనులు పూర్తయ్యాయి. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు సకాలంలో పూర్తికావడం లేదని చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది కూడా అసౌకర్యాల మధ్య విద్యార్థులు చదువు కొనసాగించాల్సిన పరిస్థితి.

పనులు పూర్తి చేయిస్తాం..

మన ఊరు– మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తి చేయిస్తాం. ఇప్పటి వరకు పనులు పూర్తయిన 35 పాఠశాలలను ప్రారంభించాం. మిగతా పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పనులను త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.
– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్ జిల్లా.

'చైర్ పర్సన్ భర్త ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: రాజకీయ అనుభవం లేకున్నా చైర్ పర్సన్ పదవి ఇచ్చామని, కానీ చైర్ పర్సన్ భర్త ఏకపక్షంగా వ్యవహరిస్తూ పార్టీకి కూడా సహకరించడం లేదని బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. పట్టణంలోని బంధన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చైర్ పర్సన్ నిర్వహించాల్సిన అధికారిక కార్యక్రమాలను ఆమె భర్త చేస్తున్నాడన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమానికి కార్యకర్తలు వస్తే ఎందుకు వచ్చారని ఎస్సైతో అడిగించారని, కళాశాల విద్యార్థినులతో హాలు నింపారన్నారు. నాలుగో వార్డు కౌన్సిలర్‌పై ఉన్న అభిమానంతో కొందరు ర్యాలీ నిర్వహిస్తే మద్యం తాగి ర్యాలీ నిర్వహించారనడం సమంజసం కాదని, చైర్ పర్సన్ భర్త తాగుబోతులు, రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వారితో భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. వైస్ చైర్మన్ మాధవరెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రగతి కార్యక్రమానికి వచ్చిన వారిపై ఫిర్యాదు చేస్తారా అని ప్రశ్నించారు. కౌన్సిల్ సభ్యులు, పార్టీ నాయకుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో రైతు బంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్, వసంత, అనురాధ, రమాదేవి, నస్రీన్ సుల్తానా, కో ఆప్షన్ సభ్యులు షౌకత్, అరుణ, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సింగ్‌రావు, అన్నూబాయ్, మాధవరెడ్డి, రాజు పాల్గొన్నారు.

యూజీడీ, సీసీ రోడ్లు వేయించాలని వినతి



శామీర్‌పేట సర్పంచ్ బాలమణికి వినతిపత్రం అందజేస్తున్న ఫ్రెండ్స్ కాలనీవాసులు

శామీర్‌పేట్: యూజీడీ, సీసీ రోడ్లు వేయించాలని ఫ్రెండ్స్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రమైన శామీర్‌పేటలోని ఫ్రెండ్స్ కాలనీవాసులు మంగళవారం శామీర్‌పేట సర్పంచ్ బాలమణి, పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీ చిన్నపాటి వర్షానికే గుంతలమయంగా మారుతుందన్నారు. కాలనీలో ఉన్న చిన్నపాటి నాలాలో నిత్యం మురుగు పొంగి పారుతోందని, దీంతో కాలనీ మొత్తం దుర్వాసన వెదజల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలనీలో కనీస సౌకర్యాలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లుతో మౌలిక వసతులను కల్పించాలంటూ వినతి పత్రం ద్వారా కాలనీవాసులు కోరారు. రిటైర్డ్ ఎమ్మార్వో సత్తయ్య, జనార్దన్‌రెడ్డి, వేణు, కనకయ్య, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జిల్లా సరస్వతీ నిలయం

- అద్భుత ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు
- విజయాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ అమోఘం
- కలెక్టరేట్ విద్యా దినోత్సవంలో మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



గుండ్లపోచంపల్లిలో నోట్‌బుక్స్ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: చదువుల తల్లి, సరస్వతీ నిలయంగా మేడ్చల్ జిల్లా వెలుగొందుతుండగా.. రాష్ట్రం విద్యారంగంలో దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. పదేళ్లలో విద్యారంగంలో ఎన్నో మంచి మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన విద్యా దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మకమైన ప్రగతి సాధించామని తెలిపారు. అన్ని పోటీ పరీక్షల్లో రాష్ట్ర విద్యార్థులు మొదటి ర్యాంకులు సాధించి సత్తా చాటుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఉండేలా ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమాన్ని రూపొందించి విజయవంతం చేసిందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టరు ఏనుగు నర్సింహారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. పంపిణీలు.. సన్మానాలు

జిల్లాలో మన ఊరు–మన బడి కింద వివిధ పనులు పూర్తయిన 26 ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించారు. పాఠశాలల్లో జాతీయ పతాక ఆవిష్కరణలతో పాటు ప్రముఖులతో 10 ఏళ్ల విద్యాభివృద్ధిపై మాట్లాడించారు. పలు ప్రభుత్వ బడుల్లో లైబ్రరీలు, డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన 121 విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 477 ట్యాబ్‌లు అందజేశారు. 10 మంది ఉత్తమ ప్రధానోపాధ్యాయులు, 15మంది ఉత్తమ ఉపాధ్యాయులు, ఐదుగురు ఉత్తమ విద్యార్థుల తల్లిదండ్రులు, ఐదుగురు ఉత్తమ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, ఐదుగురు ఉత్తమ విద్యార్థులను సన్మానించారు.

తొమ్మిదేళ్లలోనే విద్యాభివృద్ధి

ఘట్‌కేసర్: రాష్ట్రంలో తొమ్మిదేళ్లలోనే విద్యాభివృద్ధి జరిగిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. చౌదరిగూడ, కాచవానిసింగారం పంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విద్యాదినోత్సవానికి జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై రీడింగ్ రూంను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రైవేటుకు ధీటుగా ఫర్నీచర్, ఇంగ్లిష్ మీడియంలో బోధన, పాఠ్యపుస్తకాల పంపిణీ, సన్న బియ్యంతో భోజనం, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు చేయడంతో ప్రభుత్వ స్కూళ్లలో సీట్లు లభించడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దయాకర్ రెడ్డి, ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీఓ నందకిశోర్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా స్కూళ్ల అభివృద్ధి

మేడ్చల్‌రూరల్: పేద విద్యార్థులను నాణ్యమైన విద్య అందించాలని భావించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేశారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం డిజిటల్ క్లాస్‌రూమ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్ల దుస్థితి దయనీయంగా ఉండేదని, నేడు ప్రభుత్వ స్కూళ్లలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. మున్సిపల్ చైర్మన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, డీఈఓ విజయకుమారి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య..

జవహర్‌నగర్: సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నవారే ప్రపంచ మేధావులయ్యారని గుర్తుచేశారు. బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభించారు. కార్పొరేటర్లు గండి రాంచందర్, మునిగాల సతీష్, ప్రధానోపాధ్యాయులు శేఖరయ్య, నర్సింహ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా వసతులు

శామీర్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంపీపీ హారిక అన్నారు. లక్ష్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. 10వ తరగతి పరీక్షల్లో మూడుచింతలపల్లి మండల టపర్‌గా నిలిచిన లింగాపూర్ తండాకు చెందిన స్పందనకు మూడుచింతలపల్లి సర్పంచ్ జాం రవి రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతుల ప్రారంభం...

శామీర్‌పేట ప్రైమరీ పాఠశాల భవనాన్ని ఎంపీపీ యెళ్ళుబాయి, స్థానిక సర్పంచ్ బాలమణి ప్రారంభించారు. మూడుచింతలపల్లి కొల్తూర్, లక్ష్మాపూర్ స్కూళ్లలో డిజిటల్ క్లాస్ రూమ్‌లను ఎంపీపీ హారిక ప్రారంభించారు.

కీసర, నాగారం, దమ్మాయిగూడలో..

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో విద్యా దినోత్సవంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరుల పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. చీర్యాల, కరీంగూడ, రాంపల్లిదాయర, కీసర, గోధుమకుంట, భోగారం, యాద్గార్‌పల్లి, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, ఎంఈఓ శశిధర్, సర్పంచులు మాధురి, మహేందర్‌రెడ్డి, తుంగ ధర్మేందర్, పెంటయ్య పాల్గొన్నారు.

శ్రీభవానీనాగలింగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలో శ్రీభవానీనాగలింగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌ను శ్రీమాధవానంద సరస్వతి స్వామిజీ చేతులమీదుగా పంపిణీ చేశారు. 2,300 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోట్‌బుక్స్ చొప్పున పంపిణీ చేసినట్లు ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

మేడ్చల్ మండలంలో..

మేడ్చల్: డబీల్‌పూర్, నూతన్‌కల్, రాయిలాపూర్, గౌడవెల్లి, శ్రీరంగవరం తదితర గ్రామాల్లో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్ రెడ్డి, సర్పంచ్ గీతాభాగ్యరెడ్డి, కవిత జీవన్ ఎంపీడీఓ పద్మావతి పాల్గొన్నారు.

అత్వెల్లి పాఠశాలలో..

విద్యా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు మేడ్చల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అత్వెల్లి పాఠశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంఈఓ వసంతకుమారి, కౌన్సిలర్లు సరితమల్లేష్‌గౌడ్, మానసశ్రవణ్‌కుమార్‌గుప్తా, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ సునందారెడ్డి, ఉపాధ్యాయులు రాజిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.



చౌదరిగూడ రీడింగ్ రూంలో బుక్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



ఘట్‌కేసర్ జెడ్పీ స్కూల్‌లో డిజిటల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్



జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్



లక్ష్మాపూర్‌లో డిజిటల్ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీపీ హారిక, సర్పంచ్



నాగారంలో విద్యా దినోత్సవంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



దమ్మాయిగూడలో మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు



శ్రీనాగలింగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ



అత్వెల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి

నియామకం



నియామకపత్రాలను అందజేస్తున్న పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా దోయ శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులుగా నందిమల్ల సుమన్‌ను నియమించి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తకొండ వేణు, కిరణ్, యువజన నాయకులు వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు సదానంద్, దనమ్మ, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ లత, రేసు లక్ష్మీ, సరిత, నాయకులు రాజు యాదవ్, మిట్టు, సాయి, అనిల్, రవి, గండి సునీత, అజయ్‌కుమార్, సోమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నాగారంలో పర్యటిస్తా..



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాగారం జేఏసీ నేతలు

కీసర: నాగారం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నట్లు టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీకి చెందిన జేఏసీ నేతలు కీసరలో సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. వర్షాకాలంలో మున్సిపల్ పరిధిలోని సుమారు 22 లోతట్టు కాలనీల్లో పెద్ద ఎత్తున వరద సమస్యలు నెలకొన్నాయని అన్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. వరదనీటి కాల్వ పనులను ప్రధాన రహదారి నుంచి చేపట్టాలని కాలనీవాసుల డిమాండ్ చేసినా బీఆర్‌ఎస్ నాయకులు పట్టించుకోవడం లేదన్నారు. కాలనీవాసులకు అండగా నిలబడి తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో నాగారం మున్సిపాలిటీలో వివిధ కాలనీల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తూ విద్యా దినోత్సవాలా..?

మేడ్చల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ విద్యా దినోత్సవాన్ని నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు గోదా అరుణ్‌కుమార్ యాదవ్ అన్నారు. మేడ్చల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థుల చదవు కోసం ఎంతో ఉపయోగపడే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. రీయింబర్స్‌మెంట్ కింద రూ.5 వేల కోట్ల బకాయిలు ఉన్నా వాటిని విడుదల చేయడం లేదన్నారు. పేద విద్యార్థుల చదవుల కోసం ఆలోచనలు మానేసి సంబరాలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు.

ఈసీనగర్‌లో గ్యాస్ సిలిండర్ లీక్

తృటిలో తప్పిన ప్రమాదం

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు ఇంట్లో గ్యాస్ లీకై తృటిలో ప్రమాదం తప్పిన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చర్లపల్లి ఈసీనగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. ఈసీనగర్‌కు చెందిన వినోద్‌కుమార్ పెయింటర్. మంగళవారం ఇంట్లో కిచెన్ నుంచి వస్తున్న గ్యాస్ వాసనను గమనించిన ఆయన లోనికి వెళ్లగా ఇంట్లో వెలుగుతున్న బల్బు పేలి మంటలు అంటుకున్నాయి. మంటలను అదుపు చేసే క్రమంలో స్వల్పంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చర్లపల్లి ఫైర్ స్టేషన్ అధికారులు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే మంటలు అదుపులోకి రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.